క్లుప్తంగా

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం

కాచిగూడ: సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఇండియా డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జూన్ 9లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. వివరాలకు సెల్: 7893141797 నెంబరును సంప్రదించాలని కోరారు.

హజ్ యాత్రికులకు వీడ్కోలు



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: హజ్‌యాత్రకు బయలుదేరి వెళ్తున్న ముస్లింలకు బాగ్‌అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం డివిజన్‌లోని బడేమసీద్ నుంచి పలువురు హజ్‌యాత్రకు వెళ్తున్న వారిని కలిసి వీడ్కోలు పలికారు. స్థానిక బీజేపీ నాయకులు, ముస్లిం మతపెద్దలు ఉన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్



విజేతలకు మెడల్స్, బహుమతుల ప్రదానం

చిక్కడపల్లి: తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి పీఅండ్‌టీ కాలనీ బీఎస్ఎన్ఎల్ కమ్యూనిటీహాల్‌లో శని, ఆదివారాల్లో రెండురోజుల పాటు రెండో జాతీయ మాస్టర్స్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. దాదాపు 15 రాష్ట్రాల నుంచి వందలాది మంది వెయిట్‌లిఫ్టర్లు ఈ పోటీలలో పాల్గొననున్నారు. ఆదివారం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం అసోసియేషన్ చైర్మన్, రాచకొండ పోలీస్ కమిషనర్ కార్యాలయం ఏఏఓ ప్రదీప్ కుమార్, అధ్యక్షులు పీవీఆర్ నాయుడు, ప్రధాన కార్యదర్శులు శృతి పర్యవేక్షణలో సాగింది. వ్యాపారవేత్త సావిత్రిజనార్దన్ తదితరులు పాల్గొని బహుమతులను అందజేశారు. అర్జున అవార్డు గ్రహీతలు భారతిసింగ్, కెప్టెన్ పరంజిత్‌శర్మ, అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టర్ రాజుశర్మ, శివ ఛత్రపతి అవార్డు గ్రహీత ఉదయ్‌శెట్టి, నాగరాజు, పవన్‌రామ్, రంజాన్‌అలీ, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



అహ్మద్‌నగర్‌వాసులతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని సంక్షేమానికి కృషి చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్ అహ్మద్‌నగర్‌లో ముస్లింలు నిర్వహించిన 'దిల్‌సే మూలకత్' కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గడిగంటి రమేష్, నగేష్‌గౌడ్, జనార్దన్, రాహుల్, బాబాగౌస్, పాషా, ఖయ్యూం పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి: ప్రముఖ గాయకులు విజయ్‌మందపాక ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా నిర్వహించిన తెలుగు హిందీ సినీగీతాల విభావరి అలరించింది. ఆదివారం విజయ్‌తోపాటు అనుష్క, నాగవేణి, నీరజ, సావిత్రి, తమన్న, హేమలత తదితరులు గీతాలు ఆలపించగా బుర్రా మోహనకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గాయకుడు రామాచారి, త్రినాథరావు, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌లు గాయనీగాయకులు అభినందించారు.

ప్రధాని మన్‌కీబాత్‌కు విశేష ఆదరణ

చిక్కడపల్లి: ప్రధాని మన్‌కీబాత్ కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందని నగర బీజేవైఎం మాజీ నగర, బీజేవైఎం మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్ అన్నారు. 101వ కార్యక్రమాన్ని గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్‌లో ఆదివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఆనంద్‌రావు, శ్రీకాంత్, మనోహర్, స్థానికులు రఘు, పెంటయ్య, రాజయ్య, భారతి, సుగుణలు పాల్గొన్నారు.

ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు



శంకరమఠం మార్కెట్ రోడ్డులో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నల్లకుంట శంకరమఠం మార్కెట్ రోడ్డులో నాలా నిర్మాణ పనులు పూర్తికావడంతో భవిష్యత్తులో ముంపు సమస్యలు తలెత్తవని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. నియోజకవర్గంలో హుస్సేన్‌సాగర్ నాలా, మూసీపరీవాహక ప్రాంతాల్లో వరద ముంపు ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఏటా వర్షాకాలంలో నాగమయ్యకుంట నుంచి వచ్చే వరద ప్రవాహంతో పద్మాకాలనీ, పాత నల్లకుంట పరిసర ప్రాంతాలు ముంపునకు గురౌతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో ఈ సమస్యను వారు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి నాలా నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. సమస్యలను అధిగమించి వర్షాకాలం ప్రారంభానికి ముందే నాలానిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో పనులను వేగవంతం చేయించిన అధికారులు ఇటీవలనే మార్కెట్ రోడ్డులో నాలాపనులను పూర్తి చేయించారు.

రోడ్డు పనుల పరిశీలన..

- శంకరమఠం మార్కెట్ రోడ్డులో స్థానిక కార్పొరేటర్ అమృత, స్థానికులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే నూతనంగా నిర్మించిన రోడ్డు నాణ్యతను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన రోడ్డుకు కనీసం వారం, పది రోజుల పాటు క్రమం తప్పకుండా క్యూరింగ్ చేయించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితం నిర్మించిన ఇరుకైన నాలా శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో వరద, మురుగు పొంగి పద్మా కాలనీ, పాత నల్లకుంట ప్రాంతాలు ముంపునకు గురయ్యేవన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు సమస్యను సీఎం కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్‌ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీఎం సూచనలతో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ నాలా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారన్నారు. మంత్రి ఆదేశాలతో నాలా నిర్మాణ పనులు పూర్తి చేయించామన్నారు. స్థానిక కాలనీ, బస్తీల పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే చేయూత..



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

అంబర్‌పేట: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తనవంతు తోడ్పాటును అందిస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ప్రోత్సహిస్తానన్నారు. లకోటియా ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు రూప, అనూషలు, ముంతాజ్ పాఠశాలలో చదివిన చరణ్‌లు పదో తరగతిలో 9.5 జీపీఏ ఉత్తీర్ణులయ్యారు. వారికి చదువుకునే స్తోమత లేకపోవడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. రాయితీ పోగా.. మిగిలిన ఫీజును తానే భరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు సమాచారం.

- ముగ్గురు విద్యార్థులకు ఏజీఎం, ఎంపీఈ, ఐఐటీ కోర్సులో అడ్మిషన్ ఇచ్చారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



అభివాదం చేస్తున్న శ్రీలక్ష్మి, పున్నయ్య, వెంకటేష్, శంకర్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆర్థిక, విద్య, రాజకీయ, సామాజిక రంగాల్లో వెనుకబడిన చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని చాకలి ఎస్సీ సాధన సమితి అధ్యక్షురాలు చాకలి శ్రీలక్ష్మి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ×చాకలి ఎస్సీ సాధన సమితి 6వ వార్షికోత్సవ మహాసభ× ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. దేశంలోని దాదాపు 18 రాష్ట్రాల్లో చాకలి కులస్తులు ఎస్సీ జాబితాలో కొనసాగుతున్నారని తెలంగాణలో ఉన్న తమను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం గత ఆరేళ్లుగా పోరాటం చేస్తున్నా.. పాలకులు మాత్రం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను అన్ని పార్టీలు ఎన్నికల మెనిఫెస్టోలో చేర్చాలన్నారు. చాకలి బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షలు ఇవ్వడంతో పాటు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అక్కినపల్లి పున్నయ్య, డాక్టర్ ఇంద్రకంటి వెంకటేష్, కేతురు వెంకటేష్, చంద్రశేఖర్, నర్సయ్య, శంకర్, కృష్ణ, ముదిగొండ వెంకటప్పయ్య తదితరులున్నారు.

కాంగ్రెస్ దివ్యాంగుల విభాగ కార్యదర్శిగా పర్వతాలు



నియామకపత్రాన్ని అందుకుంటున్న పర్వతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం కార్యదర్శిగా బాగ్‌లింగంపల్లికి చెందిన సీ.హెచ్ పర్వతాలు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ వీరయ్య, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్‌ల చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర చైర్మన్ వీరయ్య, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు. పార్టీ సీనియర్ నాయకులు ఆనంద్‌యాదవ్, రాజు, రాములు, శ్యామ్‌యాదవ్, రవి, అజార్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి సుశీల



పల్లెల సుశీలకు నివాళులర్పిస్తున్న భరత్‌భూషణ్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దళితుల అభ్యున్నతికి తమ పోరాటాల ద్వారా కృషిచేసిన గొప్ప వనిత పల్లెల సుశీల అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ, మాదిగ మేధావుల ఫోరం, యునైటెడ్ దళిత ఫ్రంట్ సంయుక్తాధ్వర్యంలో పల్లెల సుశీల సంతాపసభ నిర్వహించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితులు చేసిన అనేక పోరాటాల్లో ఆమె భాగమయ్యారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి భరత్‌భూషణ్, బంధు సొసైటీ అధ్యక్షులు పల్లెల వీరస్వామి, మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొమ్ము ప్రవీణ్, ప్రొఫెసర్ పురుషోత్తమ్, ప్రొఫెసర్ ముత్తయ్య, రాజలింగం తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

కేంద్ర నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు



మాట్లాడుతున్న హిమాగ్నరాజ్ భట్టాచార్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని డీవైఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమాగ్నరాజ్‌భట్టాచార్య పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షులు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బ్రిజ్ భూషణ్‌సింగ్, సందీప్‌సింగ్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రెజ్లర్లను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ.. పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. అఖిల భారత అధ్యక్షుడు ఏ.ఏ.రహీం, డీవైఎఫ్ఐ అఖిల భారత కార్యదర్శి వర్గ సభ్యులు జె.కె.థామస్, రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, సంజీవకుమార్, ఇర్ఫాన్‌గుల్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావేద్ తదితరులున్నారు.

పార్లమెంట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టకపోవడంపై నిరసన

కవాడిగూడ: నూతన పార్లమెంటు భవనానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతనంగా ప్రారంభించిన పార్లమెంటు భవనాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా ప్రారంభించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. దీనికి నిరసనగా తెలంగాణ ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టి ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. దళితుల పట్ల చిత్తశుద్ధి ఉన్న వ్యక్తి సీఎం కేసీఆర్ అని అందుకే నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడంతో పాటు దేశంలోనే అతిపొడవైన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజా సంఘాల జేఏసీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

లాలాపేట: చేయిచేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష 55 రోజులకు చేరింది. ఆదివారం బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు పోచయ్యయాదవ్, బీఆర్ఎస్ యూత్ వింగ్ గ్రేటర్ అధ్యక్షులు ఆలకుంట హరి ప్రారంభించి దీక్షను ప్రారంభించి మాట్లాడారు. హాస్పిటల్ ఏర్పాటు చేసే వరకు ఆందోళనలు విరమించేది లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఆస్పత్రి ఏర్పాటుపై కచ్చితమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాణికేశ్వర్‌నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బాలయ్య, అశోక్‌కుమార్, సాయిబాబా, విష్ణు, కృష్ణప్రసాద్, వెంకటేషం, ముత్యం, పవన్, రాజు, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

సావర్కర్ పోరాట చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి



నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శ్రీస్థాను మలయన్



బీజేవైఎం నగర అధ్యక్షులు మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో..

కాచిగూడ: ప్రతి ఒక్కరూ దేశభక్తి, జాతీయ భావాన్ని కలిగి ఉండాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శ్రీస్థాను మలయన్ అన్నారు. వీర సావర్కర్ దేశానికి చేసిన సేవలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు వినాయక్ దామోదర్ వీర్ సావర్కర్ 140వ జయంతిని ఆదివారం కాచిగూడలో విశ్వహిందూ పరిషత్ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంకోసం వీర సావర్కర్ చేసిన పోరాటం నేడు ప్రతి భారతీయుడు తెలుసుకోవాలన్నారు. ఆంగ్లేయులు విధించిన అతి భయంకరమైన శిక్షను అనుభవించి అండమాన్ జైల్లో క్రూరమైన శిక్షను విధించినా ఏమాత్రం వెరవకుండా పోరాడిన మహనీయుడని కొనియాడారు. సావర్కర్ పుస్తకాలు, సినిమా చూడాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. వీహెచ్‌పీ నేతలు పండరీనాథ్, జగదీశ్వర్, బాలస్వామి, శివరాములు, పీట్లస్వామి, వెంకట్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్, శ్రీధర్, శివసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుదర్శన్, యువసేన రాష్ట్ర అధ్యక్షుడు గణేష్, సునీల్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ముషీరాబాద్: స్వాతంత్ర్య వీర సావర్కర్ జయంతి సందర్భంగా కాచిగూడ చౌరస్తాలో బీజేవైఎం నగర అధ్యక్షులు మద్దూరి శివాజీ సావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేవైఎం నాయకులు సందీప్‌యాదవ్, శివచంద్రగిరి, నితిన్‌నందేకర్, రాజ్‌కుమార్, అవినాష్ తదితరులున్నారు.

ముగిసిన భక్తి సంగీత శిక్షణ శిబిరం




భక్తిగీతాలు ఆలపిస్తున్న మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు

నల్లకుంట: సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి భక్తి సంగీత శిక్షణా తరగతుల ముగింపు వేడుకలు బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా ఆలయం ధ్యానమందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బాగ్ అంబర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పద్మావతి డీపీ రెడ్డి, దుర్గాప్రసాద్‌రెడ్డి, వెంకట రమణశర్మ, ప్రముఖ విద్యావేత్త పుష్పాభట్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలిండియా రేడియో, టీవీ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి, ఈవెంట్ మేనేజర్లు నందిని, యామినిల పర్యవేక్షణలో విద్యార్థులు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. సాయిబాబా ఆలయ సంస్థాన్ ప్రతినిధి పీవీసాయి, అకాడమీ డైరెక్టర్ వసుధామూర్తి తదితరులతో కలిసి అతిథులు వేసవి శిక్షణపూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

వస్త్రాల పంపిణీ

చిక్కడపల్లి: యువత సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ పిలుపునిచ్చారు. గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పేదలకు బట్టల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు గుర్రం చంద్రకళ, నవీన్‌కుమార్, కవిత, శీలం సత్యనారాయణ, పాశం అనిల్‌యాదవ్, సురేష్‌యాదవ్, జయ తదితరులు పాల్గొన్నారు.

విద్యావంతులు రాజకీయాల్లోకి రావడానికి ఎన్టీఆర్ కృషి



చిక్కడపల్లి: ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి ఎందరో విద్యావంతులను రాజకీయరంగంలోకి తీసుకొచ్చారని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ఎన్టీఆర్ శతజయంతి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవినీతికి అస్కారం లేని రాజకీయాలు కావాలని ఎన్టీఆర్ ఆకాంక్షించారన్నారు. నాట్యగురువు డాక్టర్ ఎస్పీ.భారతి, నటులు మాణిక్, నైషధం సత్యనారాయణమూర్తిలు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌దేనని బీజేపీ ఓబీసీసెల్ రాష్ట్ర కో– కన్వీనర్ బంటారం యాదగిరిగౌడ్ అన్నారు. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆదివారం గాంధీనగర్ డివిజన్ వివేక్‌నగర్ బస్తీలో పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. టీవీ మనోహర్, శివకుమార్, యాదగిరి, సంతోష్, యాదయ్య తదితరులున్నారు.

యువతి అదృశ్యం

చిక్కడపల్లి: యువతి అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లి సూర్యానగర్‌లో నివసించే గృహిణి మేడిశెట్టి రమాదేవి(25) ఆదివారం ఉదయం కూల్‌డ్రింక్ కోసం వెళ్లి తిరిగి రాలేదు. తల్లి మంగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్ట్‌టైమ్ లెక్చరర్లకు పదోన్నతి కల్పించాలి

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పని చేస్తున్న పార్ట్‌టైమ్ లెక్చరర్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్స్(కాంట్రాక్టు)గా పదోన్నతి కల్పించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు దునుకు వేలాద్రి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో దాదాపుగా 775 మందికి పైగా పార్ట్‌టైం లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్నారని చాలా యూనివర్సిటీల్లో రెగ్యూలర్ అధ్యాపకుల కొరత కారణంగా పని భారమంతా వీరిపైనే పడుతుందన్నారు. కాబట్టి 16 గంటల వర్క్ లోడ్ ఉన్న అర్హత గల లెక్చరర్లకు పదోన్నతులు ఇవ్వాలని ఈ విషయమై త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖా మంత్రిని కలుస్తామన్నారు.

ప్రజల్లోకి పార్టీని తీసుకెళ్లండి..



మాట్లాడుతున్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు

అంబర్‌పేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు పార్టీ నేతలకు సూచించారు. ఆదివారం గోల్నాక డివిజన్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 9 ఏళ్ల కేంద్ర ప్రభుత్వ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ పథకాలను ఈ నెల 30 నుంచి వచ్చే నెల 30 వరకు జనసంపర్క్ అభియాన్ పేరుతో ఇంటింటికీ తీసుకెళ్లాలని కోరారు.

- తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు, వందేభారత్ రైళ్లు, రోడ్ల అభివృద్ధిని వివరించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను సైతం ప్రజల్లో ఎండగట్టాలని ఆయన కోరారు. పార్టీ డివిజన్ కన్వీనర్ మూల రవీందర్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ శ్యామ్‌రాజ్, నర్సింగ్ యాదవ్, సుదర్శన్, ఆర్‌కే.రాంచందర్, కృష్ణంరాజు, ఈశ్వర్, ఎస్.రాజేష్ తదితరులున్నారు.

అంబర్‌పేటలో...

అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షులు నాగభూషణం చారి ఆధ్వర్యంలో పార్టీ డివిజన్ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. 30 రోజుల పాటు ప్రధాని నరేంద్ర మోదీ పాలనా ఫలాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ నాయకులు ఆనంద్‌గౌడ్, భిక్షపతి, యాదగిరి, శ్రీకాంత్ తదితరులున్నారు.

'అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉండండి'

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు మహిళలు సిద్ధంగా ఉండాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత 9 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం కాచిగూడ చౌరస్తాలోని వీర సావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ మహిళా మోర్చా నేతలు కళ్యాణం గీతారాణి, కొప్పెర శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై వ్యతిరేక వైఖరిని విడనాడాలి



భూపేష్ సాగర్

కాచిగూడ: బీసీల పట్ల వ్యతిరేక వైఖరిని విడనాడాలని లేదంటే తెలంగాణలో బీసీలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నీరడి భూపేష్‌సాగర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న బీసీ నేతలు 40 శాతం రిజర్వేషన్‌లపై ప్రశ్నించకుండా ఉండటం సిగ్గుచేటన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించిన పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందని బీసీలను విస్మరించిన పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీసీల పట్ల రేవంత్ రెడ్డి చులకన భావంతో మాట్లాడటం మానుకోవాలని లేదంటే బీసీలు తిరగబడతారని హెచ్చరించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (55) సీతాఫల్ మండి రైల్వే స్టేషన్ వద్ద రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై ఆకుపచ్చ రంగు చొక్కా, బూడిద రంగు ప్యాంటు ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇక్కట్లు

లాలాపేట: విద్యుత్ సరఫరాలో తరచూ తలెత్తుతున్న అంతరాయంతో లాలాపేట సత్యనగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు తార్నాక, లాలాపేట, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో అప్పుడప్పుడు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో బయట ఎండ, ఇంట్లో ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నామన్నారు. వర్క్‌ఫ్రం చేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కార్యకలాపాలు నిలిచిపోతున్నాయి. దీనిపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.